## క్లుప్తంగా

### ప్లేట్లు పంపిణీ


ప్లేట్లు అందజేస్తున్న వీడీసీ సభ్యులు

కైలాస్‌నగర్(జైనథ్): జైనథ్ మండలం లక్ష్మీపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన సౌకర్యార్థం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో 50 ప్లేట్లను బుధవారం అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు అశోక్, కమిటీ చైర్మన్ దాసరి నారాయణ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ ఆరె గంగమ్మ, మాజీ సర్పంచ్ రాములు, స్వామి, ఉపాధ్యాయుడు హన్మంత్‌రావ్ పాల్గొన్నారు.

### నేడు ఇచ్చోడకు ఎమ్మెల్యే రాక

ఇచ్చోడ: బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ గురువారం ఇచ్చోడ మండలంలో పర్యటించనున్నట్లు బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు మండలంలోని కేశవపట్నం గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేయనున్నారు. 10 గంటలకు గేర్జం, మండల కేంద్రంలోని భీమన్న గుట్టలో పర్యటిస్తారని ఆయన తెలిపారు.

### ఆరోగ్య నియమాలు పాటించాలి


మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: ప్రతిఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటించాలని హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ అన్నారు. నిక్షయ్ శివిర్ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని తర్నం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్షయ (టీబీ) మహమ్మారికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. దేశంలో టీబీని నిర్మూలించడమే లక్ష్యంగా ముందుకు సాగుతుందన్నారు. గ్రామస్తులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ వాణి, నరేందర్ రెడ్డి, గంగమ్మ, ఆనంద తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాలల్లో క్రీడలు ప్రారంభం


సొనాలలో ప్రారంభమైన క్రీడలు

బోథ్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలు ప్రారంభమయ్యాయి. సొనాలలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో బుధవారం క్రీడలు ప్రారంభించారు. మూడు రోజుల పాటు క్రీడలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సచిన్ తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు.

### తహసీల్దార్‌కు సన్మానం

బజార్‌హత్నూర్: మండలంలోని భూతాయి(కే) గ్రామంలో ప్రజాపాలన గ్రామ సభ అనంతరం తహసీల్దార్ శంకర్‌ను బుధవారం గ్రామస్తులు శాలువాతో సత్కరించారు. తహసీల్దార్ శంకర్ ఈ నెల 31న పదవీ విరమణ పొందుతున్న క్రమంలో గతంలో గ్రామానికి అందించిన సేవలకు కృతజ్ఞతగా సన్మానించినట్లు గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ నూర్‌సింగ్, ఏఈ వెంకటేశ్, మాజీ సర్పంచ్ మారుతి, ఉపసర్పంచ్ జైతు తదితరులు పాల్గొన్నారు.

### కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభం


నార్నూర్: కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న సభ్యులు

నార్నూర్: మండల కేంద్రంలో ఖందేవ్ జాతర సందర్భంగా నిర్వహిస్తున్న కబడ్డీ టోర్నమెంట్‌ను బుధవారం దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్ ధారావత్ ప్రవీణ్ కుమార్ ప్రారంభించారు. అంతకు ముందు తొడసం వంశీయుల ఆరాధ్య దైవం ఖందేవునికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటి చైర్మన్ తొడసం నాగోరావు, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, మాజీ సర్పంచ్ మాడవి రూప్‌దేవ్, జేఏసీ మాజీ చైర్మన్ ఉత్తం, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు ఈశ్రు ఉన్నారు.


నేరడిగొండ: మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌వీర్


తలమడుగు: గ్రామసభలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి గజానంద్


ఇంద్రవెల్లి: గ్రామసభలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ రాథోడ్ రాజేశ్వర్


బోథ్: దరఖాస్తులు పరిశీలిస్తున్న ఆడె గజేందర్

# అర్హులకు ప్రభుత్వ పథకాలు అమలు

- జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి
- రెండోరోజు కొనసాగిన గ్రామసభలు


సిరికొండ: మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్

ఇచ్చోడ: అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామని జెడ్పీ సీఈవో జితేందర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులోని రైతు వేదికలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాల మంజూరుకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. మండల కేంద్రంలో దాదాపు వంద ఎకరాలకు పైగా వెంచర్లు, కట్టడాలు ఉన్నట్లు గుర్తించి వాటిని రైతుభరోసా జాబితా నుంచి తొలగించినట్లు తెలిపారు. ఎంపీడీవో లక్ష్మణ్, ఈజీఎస్ ఏపీవో నరేందర్‌గౌడ్, ఏఈవో సంజీవ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ: రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక జాబితా ప్రకటించే గ్రామసభలు మండలంలో బుధవారం రెండోరోజు కొనసాగాయి. మండలంలోని సుంకిడి, పోచంపల్లి, మల్లపూర్ గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. గ్రామసభలో లబ్ధిదారుల జాబితా చదివి వినిపించారు. ఎంపీడీవో రవీందర్, తహసీల్దార్ తుకారం, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, ఎంపీవో సంతోష్ కుమార్, ఏడీవో రామకిషన్, మండల వ్యవసాయ అధికారి శారద, ఈజీఎస్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**గ్రామసభలో రుణమాఫీ చేయాలని వినతి**

తాంసి: భీంపూర్ మండలంలోని గోముత్రి గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో గ్రామానికి చెందిన రైతులు 55 మంది రుణమాఫీ కాలేదని సభలో అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని ఇప్పటివరకు పూర్తిగా అమలు చేయలేదన్నారు. తమకు రుణమాఫీ చేయాలని సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని గ్రామసభలో గ్రామ ప్రత్యేకాధికారి చంద్రశేఖర్‌కు అందజేశారు. రైతులు నారాయణ, నాగయ్య, జీవన్ తదితరులు ఉన్నారు.

**నేరడిగొండలో..**

నేరడిగొండ: గ్రామాల్లో రేషన్ కార్డుల సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. బుధవారం మండలంలోని కుంటాల(కె), ఇస్పూర్, బుద్దికొండ, బొరిగాం, రాజురా, లఖంపూర్, తర్నం (కె) గ్రామాల్లో సర్వే కొనసాగగా సర్వే తీరును ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్, ఆర్ఐ నాగోరావ్, ఏఎస్సై రామకృష్ణలు పరిశీలించారు. ఆయా గ్రామాల ప్రజలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**బోథ్‌లో..**

బోథ్: మండలంలోని బోథ్, నిగిని, పొచ్చెర, కుచులాపూర్, బిర్లాగొంది, కరత్వాడ, పార్డి కె, కేశవ్‌గూడ గ్రామ పంచాయతీల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. రైతు భరోసా, ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల లబ్ధిదారులను గుర్తించారు. కొత్తగా ప్రజల నుంచి పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. బోథ్‌లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ పాల్గొని, దరఖాస్తు చేసుకుంటున్న వారితో మాట్లాడారు. తహసీల్దార్ సుభాష్ చందర్, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో అతుల్ కుమార్, శ్రీధర్, స్వామి, మల్లేశ్, సూరజ్‌రావ్, రాజేశ్వర్ తదిరుతులు పాల్గొన్నారు.

**నార్నూర్‌లో..**

నార్నూర్: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని తహసీల్దార్ జాడి రాజలింగు అన్నారు. బుధవారం మండలంలోని గుండాల, మాన్కాపూర్, బేతాల్‌గూడలో గ్రామసభలు నిర్వహించారు. మాన్కాపూర్‌లో ఎంపీడీవో జవహర్, గుండాలో తహసీల్దార్ జాడి రాజలింగు, బేతాల్‌గూడలో సూపరింటెండెంట్ గంగాసింగ్‌లు పాల్గొన్నారు. టీఏ కైలాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఉట్నూర్ మండలంలో..**


తాంసి: రుణమాఫీ చేయాలని వినతిపత్రం అందజేస్తున్న రైతులు


ఇచ్చోడ: గ్రామసభలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి


నార్నూర్: గుండాల గ్రామంలో..

ఉట్నూర్‌రూరల్: మండలంలోని శ్యాంపూర్ గ్రామంలో ప్రజాపాలన గ్రామసభ నిర్వహించారు. అధికారులు లబ్ధిదారుల జాబితా చదివి వినిపించారు. లబ్ధిదారులు తమ పేర్లను సరిచూసుకున్నారు. అనంతరం కొందరి పేర్లు లిస్టులో లేక పోవడంతో అధికారులను నిలదీశారు. ఎంపీవో సురేందర్ రెడ్డి మరోమారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**గ్రామసభల్లో గందరగోళం**

తలమడుగు: తలమడుగు మండలంలోని రుయ్యాడి, సుంకిడి, సాయిలింగి గ్రామసభల్లో గందరగోళం నెలకొంది. గ్రామసభలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఆదిలాబాద్ ఎంపీ నగేశ్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ల ఫొటోలు లేకపోవడంతో బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు అధికారులను నిలదీశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే గ్రామసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు అర్హులకు అందడం లేదన్నారు. అర్హుల పేర్లు జాబితాల్లో ఎందుకు లేవని ప్రశ్నించారు. ప్రత్యేకాధికారి గజానాద్ మాట్లాడుతూ జాబితాలో పేర్లు లేని లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐ ఫణిందర్, ఎస్సై అంజమ్మలు బందోబస్తు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవో వినోద్ పాల్గొన్నారు.

**ఇంద్రవెల్లిలో..**

ఇంద్రవెల్లి: అర్హులకు ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని, జాబితాలో పేర్లు లేనివారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ రాథోడ్ రవీందర్ అన్నారు. బుధవారం మండలకేంద్రంతో పాటు కేస్లాపూర్, ముత్నూర్, గౌరపూర్, మెండపల్లి, వాల్గోండ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. మండలకేంద్రంలోని గ్రామ సభకు మండల ప్రత్యేకాధికారి రాథోడ్ రవీందర్ హాజరయ్యారు. అర్హుల జాబితా చదివి విన్పించగా బీఆర్‌ఎస్ నాయకులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వివాదం జరిగింది. ఎస్సై ఇరు పక్షాలకు నచ్చచెప్పారు. తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, ఎంపీవో జీవన్‌రెడ్డి, ఈవో సంజీవ్‌రావు తదితరులు ఉన్నారు.

**బజార్‌హత్నూర్‌లో..**

బజార్‌హత్నూర్: మండలంలోని బోస్రా, భూతాయి(కే), చందునాయక్‌తాండ, కాండ్లీ, కిన్నెరపల్లి, గులాబ్‌తాండ, కొలారి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన గ్రామసభల్లో గందరగోళం నెలకొంది, అర్హుల పేర్లు జాబితాలో లేవని అధికారులను నిలదీశారు. చందునాయక్‌తాండ, గులాబ్‌తాండా గ్రామసభలో ఫ్లెక్సీపై ఎమ్మెల్యే ఫొటో లేకపోవడంతో బీఆర్‌ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ప్రోటోకాల్ పాటించడంలేదని గిరిజన ఎమ్మెల్యేను అవమాన పరుస్తున్నారని అనితరవీందర్, విద్యాసాగర్, బాలాజీ, గబ్బర్‌సింగ్, అరుణ్ ఆందోళనకు దిగారు. అధికారులు కల్పించుకుని ఫ్లెక్సీలపై ఫొటోలకు సంబంధించి తమకు ఎలాంటి ఆదేశాలు లేవన్నారు. అనంతరం సభను త్వరగా ముగించుకుని అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, ఎస్సై అప్పారావు ఉన్నారు.

# డీఎంహెచ్‌వో పరామర్శ

బేల: మండలంలోని రేణిగూడ గ్రామానికి చెందిన రైతు జాదవ్ దేవ్‌రావు జిల్లా కేంద్రంలోని బ్యాంకులో అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోగా బుధవారం బాధిత కుటుంబాన్ని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి రాథోడ్ నరేందర్ పరామర్శించారు. గత కొంత కాలంగా తీవ్రమైన కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఆ రైతు భార్య జాదవ్ జీజబాయికి చెందిన వైద్య రిపోర్టులు పరిశీలించారు. మెరుగైన వైద్యం అందించడానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైద్యాధికారి వంశీ, ఫార్మసిస్ట్ రవీందర్, ఏఎన్‌ఎం లత తదితరులు ఉన్నారు.


పరామర్శిస్తున్న రాథోడ్ నరేందర్

# ఫీజు బకాయిల కోసం ర్యాలీ



బేలలో ర్యాలీ చేస్తున్న డిగ్రీ విద్యార్థులు

బేల: మండల కేంద్రంలోని కీర్తన డిగ్రీ కళాశాల విద్యార్థులు తెలంగాణ రాష్ట్ర డిగ్రీ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ పిలుపు మేరకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని బుధవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ పుష్ప మాట్లాడుతూ గతేడాది నుంచి వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాల లీగల్ అడ్వైజర్, అడ్మిస్ట్రేషన్ ఇన్‌చార్జి సాగర్, అధ్యాపకులు బిందు, సౌందర్య, అమోల్, సంజీవ్, కిష్టారెడ్డి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# నాటు సారా నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్

నార్నూర్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ రవికాంత్ ఆదేశాల మేరకు బుధవారం అసిస్టెంట్ కమిషనర్ హిమశ్రీ ఆధ్వర్యంలో నాటుసారా నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంతో పాటు నాగల్‌కొండ గ్రామంలో దాడులు నిర్వహించి 6 లీటర్ల నాటుసారా, 225 కేజీల నల్ల బెల్లం, 85 కిలోల పటిక, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాటుసారా తయారుచేసినా విక్రయించినా, తయారీకి ఉపయోగించే ముడిసరుకులు విక్రయించినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐలు గంగారెడ్డి, అక్బర్ హుస్సేన్, డీటీఎస్ సీఐ ముత్యం, ఉట్నూర్ ఎస్సై మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


బెల్లం, పటికతో ఎక్సైజ్ సిబ్బంది

### ‘జిల్లాపై కేంద్రం చిన్నచూపు’

బోథ్: ఆదిలాబాద్ జిల్లాపై కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి ఆరోపించారు. బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాకు చెందిన ఎంపీ, అసెంబ్లీ ఫ్లోర్ లీడర్, ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నా.. జిల్లాకు నిధులు తీసుకురాలేదన్నారు. మహేశ్, నారాయణ ఉన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ: మండలంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇచ్చోడ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ వినోద్ సొద బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 –26 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో చేరేందుకు విద్యార్థులు ఫిబ్రవరి 1 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో (ఈఎంఆర్‌ఎస్) 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఉట్నూర్ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ అర్వింధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో బాలికలు 30, బాలురు 30 మొత్తం 60 సీట్లకుగాను దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 16లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు 9441918178లో సంప్రదించాలని కోరారు.

# ఆరోగ్యంపై కళాబృందం అవగాహన

ఇచ్చోడ: మండలంలోని బాధిగూడ, దాబా(కే), చించోలి, గేర్జం గ్రామాలలో బుధవారం జిల్లా మాస్‌మీడియా అధికారి రవిశంకర్, జిల్లాఆరోగ్య బోధకులు వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో కళాజాత బృందంచే గ్రామాలలో అవగాహన కల్పించారు. మూఢ నమ్మకాలపై పాటల రూపంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాస్‌మీడియా జిల్లా అధికారి రవిశంకర్ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల ప్రజలు మూఢనమ్మకాలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి ఉత్తం, పర్యవేక్షకులు సుభాష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**నార్నూర్‌లో..**

నార్నూర్: మండల కేంద్రంలోని ఖందేవ్ జాతరతో పాటు మల్కుగూడ, కొత్తపల్లి –హెచ్, భీంపూర్ గ్రామాల్లో నేషనల్ హెల్త్ మిషన్, రోడ్డు భద్రత, డ్రగ్స్, క్షయ వ్యాధి, డెంగీ, మలేరియా, మన తెలంగాణ మన వ్యవసాయం, మాదకద్రవ్యాలు, కుటుంబ నియంత్రణ, పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలకు బుధవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాజాత బృందంచే అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, హెచ్‌ఈవో తులసిదాస్, ఫార్మసిస్ట్ విలాస్, కళాజాత టీం లీడర్ ఆత్రం గోవిందరావు, కళాకారులు రాథోడ్ శంకర్, ఆశిష్, నగేశ్, దుర్పాతబాయి తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న కళాకారులు

# జోరుగా కల్తీ కల్లు విక్రయాలు

- పట్టించుకోని ఎక్సైజ్, పోలీస్ అధికారులు

ఆదిలాబాద్‌రూరల్: పట్టణ శివారులోని సర్వే నంబర్ 68 ప్రాంతంలో కల్తీ కల్లు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కల్లు ఉత్పత్తికి అవసరమైన ఈత, తాటి చెట్లు లేకున్నా నిత్యం షాపు పరిధిలో వేలాది లీటర్ల కల్తీ కల్లు విక్రయిస్తున్నారు. పట్టణంలోని శివారు కాలనీలకు చెందిన వారితోపాటు షాపు మీదుగా ప్రయాణించే వారు కల్తీకల్లుకు బానిసలుగా మారుతున్నారు. కల్తీ కల్లు సేవించి తమ ఆరోగ్యానికి చిల్లు పడుతుండగా కుటుంబాలు రోడ్డున పడాల్సిన దుస్థితి నెలకొంటుంది. ప్రధాన రహదారికి ఆనుకునే కల్తీకల్లు విక్రయాలు యథేచ్ఛగా సాగుతున్నప్పటికీ ఎక్సైజ్, పోలీస్ అధికారులు మామూలుగా తీసుకుంటూ అటువైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**తరుచూ గొడవలు..**

కల్తీకల్లును సేవిస్తున్న వారు మద్యం మత్తులో తూగుతూ గొడవపడుతున్నారు. కల్తీకల్లుతో పాటు గంజాయి విక్రయాలు సైతం ఆ ప్రాంతంలో జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. మత్తులో మందుబాబులు గొడవ పడుతుండటంతో పాటు అటుగా వెళ్లే వారితోనూ గొడవకు దిగుతున్నారు. గతంలో పలుమార్లు జరిగిన గొడవలతో పోలీస్‌స్టేషన్ వరకు వెళ్లి ఫిర్యాదు చేసిన సంఘటనలు ఉన్నాయి. ఇంత జరుగుతున్నా అక్రమంగా సాగుతున్న కల్తీ కల్లు విక్రయాలను కట్టడి చేయకపోవడంపై ఆంతర్యమేంటని ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు దీనిపై దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై షాపు నిర్వాహకులను ఫోన్‌లో సంప్రదించగా తమకు అనుమతులు ఉన్నాయన్నారు. ఎక్సైజ్ సీఐ విజేందర్‌ను సాక్షి ఫోన్‌లో సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.


సర్వే నంబర్ 68లోని కల్లుబట్టి

**ఎక్సైజ్‌శాఖ దృష్టికి తీసుకెళ్లాం**

సర్వే నంబర్ 68లో తెల్లకల్లు దుకాణం అక్రమంగా కొనసాగుతున్నట్లు తమ దృష్టికి రావడంతో దానిపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారులకు లేఖ రాశాం. కల్తీకల్లును కట్టడి చేయాల్సిన బాధ్యత వారిపైనే ఉంది. కానీ ఇప్పటి వరకు ఆ శాఖ అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాలేదు.

– ముజాహీద్, ఎస్సై

### రాజ్యాంగ దినోత్సవం నిర్వహించాలి


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బోథ్: మండలంలోని ప్రతీ పోలింగ్ బూత్‌లో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించాలని బీజేపీ మండల కన్వీనర్ బోరె రవీందర్ అన్నారు. బుధవారం బోథ్‌లో ఆయన మాట్లాడుతూ.. 23, 24వ తేదీల్లో ప్రతి గ్రామంలోకి వెళ్లి రాజ్యాంగం గొప్పదనాన్ని తెలియజేయాలన్నారు. 25న ప్రభుత్వ పాఠశాలలకు వెళ్లాలన్నారు. నాయకులు వెంకటేశ్, మహిపాల్, షేకన్న, విష్ణు, దాసు, సాయి రోహిత్, నాయకులు పాల్గొన్నారు.